ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత


ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తంగెడుపల్లెలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ పాలనకు, ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించాలని ప్రజలను కోరారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టలేని విధంగా విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మరో సారి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, పౌరసరఫరాల డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వీరశేఖర్, మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాధిక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి, సర్పంచు సుబ్బరాయుడు, స్థానిక నాయకులు శంకర్‌రెడ్డి, వీరభద్రారెడ్డి, యోగాంజనేయులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీతో గ్రామాలకు మహర్దశ

జమ్మలమడుగు : త్వరలో రానున్న స్టీల్‌ప్లాంట్‌తో గ్రామాలకు మహర్దశ వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దదండ్లూరు పంచాయతీ పరిధిలోని సిరిగేపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలతో పాటు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మీకు మేలు జరిగి ఉంటే తమకు అండగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు. గతంలో ఎవ్వరూ చేయని విధంగా పార్టీలకతీతంగా నవరత్నాల పథకాలను అమలు చేశామన్నారు. గతంలో ఉన్న పాలకులకు ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాలను గమనించాలన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేశారు. అయితే ఆయన అకాల మరణంతో స్టీల్‌ప్లాంట్ పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. ఆతర్వాత వచ్చిన పాలకులు స్టీల్‌ప్లాంట్ గురించి పట్టించుకోలేన్నారు. తిరిగి ఆయన కుమారుడైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టీల్‌ప్లాంట్ ఎర్పాటు చేయడం కోసం ముందుకు వచ్చి మీ ప్రాంతంలోనే భూమిపూజ కూడా చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజలపై ప్రేమ ఉండటంతోనే స్థానికులకే ఎక్కువగా ఉద్యోగావకాశాలతో పాటు, ఉపాధి అవకాశాలు కల్పించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జమ్మలమడుగు చరిత్రలో ఎమ్మెల్యేలు ఏడాది పొడవున ప్రజలకు అందుబాటులో ఉన్న దాఖలాలు లేవు. కానీ నేను ప్రతి నిత్యం ప్రజలతో మమేకమే వారి సమస్యలను తెలుసుకునేటందుకు వారి ఇంటివద్దకే వస్తున్నానన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కులాయిరెడ్డి, స్థానిక నాయకులు అయ్యవారు, పొన్నమాన్యం చంద్ర, రామిరెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చర్మ వ్యాధుల, గుండె వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో చర్మవ్యాధులు, గుండె వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, నోట్లో పక్కులు, సలిపిరి, అమ్మవారు, మంగు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై మచ్చలు, కుష్టు ఇతర చర్మ వ్యాధులకు చికిత్సలు అందిస్తారని అలాగే కర్నూల్ విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బు వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి, మధ్యాహ్నం నుంచి అందుబాటులో ఉంటారు. అలాగే ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణలు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీలు వాపు, కిడ్నీ గడ్డలు, మూత్ర సమస్యలు, అంగ సమస్యలు, గజ్జల్లో వాపు, బీజము సమస్యలు, పిల్లలు పుట్టక పోవడం వటి వాటికి ప్రతి నెల రెండవ, నాల్గవ ఆదివారాలలో అందుబాటులో ఉంటారు. అలాగే ఆదివారం ఉచితంగా షుగర్ పరీక్షలను షుగర్ స్పెషలిస్ట్ హర్షవర్ధన్‌రెడ్డి సలహాల మెరకు పరీక్షలు చేయించుకోవాలనే వారు పడగడపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జ్ఞాన కేంద్రంగా వైవీయూ గ్రంథాలయం

– ఆధునీకరించిన వెబ్‌సైట్ ప్రారంభించిన వీసీ


వైవీయూలో ఆధునీకరించిన వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : విద్యార్థులు, పరిశోధకులు విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయాన్ని వినియోగించుకుని ప్రతిభామూర్తులుగా తయారుకావాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ఆకాంక్షించారు. శుక్రవారం వైవీయూలో డా. ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రగ్రంథాలయంలో లభించే పుస్తక సంపద, డిజిటల్ సౌకర్యాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేస్తూ ఆధునీకరించిన వెబ్‌సైట్‌ను రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, గ్రంథాలయ బాధ్యులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు తరగతులు మినహా మిగులు సమయాల్లో గ్రంథాలయంలో పుస్తకాలతో స్నేహం చేయాలన్నారు. పుస్తకాలు, జర్నల్స్, థీసిస్, సాఫ్ట్‌వేర్స్ ఈ-జర్నల్స్, ఈ-డేటాబేస్, ఈ-బుక్స్ సిద్ధంగా ఉన్నాయన్నారు. స్కాలర్స్‌కు ప్రత్యేకంగా డిజిటల్ లైబ్రరీలో గ్రామర్లీ, జింజర్, ఎస్పీఎస్ఎస్, క్విల్‌బోట్, ఎండ్‌నోట్, కెమిడ్రా వంటి సాఫ్ట్‌వేర్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు. వెబ్‌సైట్‌లో ఈ కేటలాగ్‌ను సందర్శించి అవసరమైన పుస్తకాన్ని గుర్తించి గ్రంథాలయంలో ఆన్‌లైన్‌లోను, ఆఫ్‌లైన్‌లోను విద్యార్థులు చదువుకునే అద్భుత అవకాశం కల్పించామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రీసెర్చ్ స్కాలర్లు పరిశోధన గ్రంథం తయారుచేసుకునేందుకు డిజిటల్ గ్రంథాలయం చక్కగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఐటీ నెట్‌వర్కింగ్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి. శంకర్, లైబ్రరీ అసిస్టెంట్లు బి. ప్రసాద్‌రావు, ఆర్. విజయకుమార్, నాగరాజు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పంచనదీ తీరంలో యోగా ఉత్సవం

కడప కల్చరల్ : జిల్లాలో పంచనదీ సంగమ క్షేత్రంగా పేరున్న పుష్పగిరిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్కడి నదీ తీరంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కడప నగరానికి చెందిన మిత్ర యోగా సొసైటీ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్ట్ కల్పన తెలిపారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ యోగా దినోత్సవానికి మూడు రోజుల ముందు నదీ తీరంలో దాదాపు వెయ్యి మందికి పైగా సాధకులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహింపజేస్తామన్నారు. పుష్పగిరి భాస్కర (సూర్య) క్షేత్రంగా పురాణాలు పేర్కొన్నాయని, అలాంటి ప్రాంతంలో ఉదయం 6 నుంచి 7.30 గంటల్లోగా వినూత్న రీతిలో యోగా, సూర్య నమస్కారాలు చేయించడం మంచిదని పెద్దలు సూచించడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. 13వ తేదీ నుంచి వారం రోజులపాటు యోగా వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి 1400 పుస్తకాలు


పుస్తకాలను అందజేస్తున్న నిత్యానందరావు, గీతారాణి

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి మరో 1400 పుస్తకాలు చేరాయి. శుక్రవారం హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు వెలుదండ నిత్యానందరావు, గీతారాణి 1100 పుస్తకాలు, ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి 300 పుస్తకాలను బ్రౌన్ గ్రంథ పాలకులు హరిభూషణరావు, సిబ్బంది నీలకంఠేశ్వర్‌లకు అందజేశారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తమకు చేరిన పుస్తకాలలో చాలా అరుదైన గ్రంథాలు ఉన్నాయని తెలిపారు. తెలుగు గజళ్లు-అధ్యయనం, చందమామ కథలు, పరిశీలన, ప్రకాశం జిల్లా మహిళా సాహితీమూర్తులు, తెలుగు సినీ గేయ సాహిత్యం, తెలుగులో బౌద్ధం, బౌద్ధ సాహిత్యం తదితర అరుదైన పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. ప్రముఖ చిత్రకారులు, రచయిత శీలా వీర్రాజు స్వయంగా చిత్రించిన వేమన చిత్రపటాన్ని ఆయన సతీమణి శీలా సుభద్రాదేవి పుస్తకాలతోసహా తమకు అందజేసిందన్నారు.

పీసీపల్లె వాసుల కల నెరవేరింది


సీసీరోడ్డు వేసిన దృశ్యం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని గొడ్లవీడు పంచాయతీ పీసీపల్లె లో ఉన్న ఆర్‌అండ్‌బీ గత కొన్ని ఏళ్లుగా దెబ్బతినడంతో వర్షం వస్తే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. బి.మఠం - బద్వేల్ రోడ్డు నుంచి గొడ్లవీడుకు ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. గుండాపురం, పీసీపల్లె, గొడ్లవీడుకు బస్సు సౌకర్యం కూడా ఉంది. గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు రోడ్డు కోసం గ్రామస్తులు మండల స్థాయి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. గ్రామంలో వాహనాలు, పాదచారుల రద్దీ అధికంగా ఉంటుంది. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడటంతో వర్షం వస్తే వాహనాల తాకిడికి వర్షం నీరు ఇళ్ల లోపలికి వెళ్లడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. బి.మఠం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డిలు గ్రామంలో తప్పకుండా సీసీరోడ్డు కావాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పై ఒత్తిడి తెచ్చి ఆర్‌అండ్‌బీ నిధులు రూ.40లక్షలు మంజూరు చేయించడంతో స్థానిక సర్పంచ్, కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధారెడ్డిలు నిర్మాణ పనులు చేపట్టడంతో ఇప్పుడు సీసీ రోడ్డు ఏర్పాటైంది. దీంతో గ్రామస్తుల ఎన్నో ఏళ్ల ఎదురుచూస్తున్న రోడ్డు సౌకర్యం రావడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

12న దేవస్థానంలో బహిరంగ వేలం

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మి వృషభాచలేశ్వరస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో 12వ తేదీన సోమవారం ఉదయం 10 గంటలకు తలనీలాలు ప్రోగు చేసుకును హక్కుకు గాను బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ పాలక మండలి చైర్మన్ వెంకటేష్ తెలిపారు. ఈ వేలం పాట దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

వేముల : వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని బెస్తవారిపల్లె, గ్రామంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే సందర్భంగా సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే, లార్వ, సర్వే నిర్వహించి నిల్వ ఉన్న నీటి తొట్టిలలో పిచికారి చేసి మలేరియా, డెంగ్యీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటుకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు. డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు అయితే పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వీణా కుమారి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

జమ్మలమడుగు : స్థానిక మున్సిపాలిటీ రహదారి వద్ద నుంచి అలాగే నాగులకట్ట ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు రాత్రిపూట వెళ్లేటందుకు వీధి దీపాలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వీధి దీపాలను ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ కోరారు. శుక్రవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాత్రి పదిగంటల సమయంలో అలాగే తెల్లవారు జామున ఐదుగంటల ప్రాంతంలో ధర్మవరం, విజయవాడ నుంచి ప్రయాణీకులు వస్తుంటారన్నారు. దారి ముళ్లపొదలతో నిండి ఉండటంతో విష సర్పాలు ఎక్కువగా సంచరిస్తుంటాయని కావును అధికారులు వీధిదీపాలను ఏర్పాటు చేయాలని కోరారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం


మాట్లాడుతున్న సీహెచ్ఓ సుకుమార్

చింతకొమ్మదిన్నె : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని సీహెచ్ఓ సుకుమార్ తెలిపారు. శుక్రవారం సీకేదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో బలాన్ని ఇస్తాయన్నారు. గ్రామాల్లోని ఏఎన్ఎంలు తల్లిపాల గురించి గర్భిణులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని ఓబులాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన దస్తగిరి స్వామి దర్గాలో శుక్రవారం గ్రామస్తులు గంధం , జెండా మహోత్సవం నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన శివకృష్ణచౌదరికి చెందిన వృషభాలు మొదటి బహుమతి రూ.1,00,116లు, కాశినాయన మండలం ఆనవారిపల్లె గ్రామానికి చెందిన శీలంజగన్‌మోహన్‌రెడ్డి వృషభాలు రెండవ బహుమతి రూ.70,116లు, ప్రకాశం జిల్లా జె.సి.అగ్రహారం గ్రామానికి చెందిన లక్క నాగశివశంకర్ వృషభాలు మూడవ బహుమతి రూ.60,116లు, వైఎస్సార్‌జిల్లా వీరపునాయునిపల్లె గ్రామానికి చెందిన చిట్టిబోయిన భరత్ కుమార్ వృషభాలు నాల్గవ బహుమతి రూ.30,116లను గెలుచుకున్నాయి. మిగిలిన మూడు జతల వృషభాలకు రూ.15,116, 10,116, రూ.10,116లు అందజేశారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సంఘ సంస్కర్త విలియం కేరీ

కడప రూరల్: మూఢ నమ్మకాల నిర్మూలనకు కృషి చేసి సమాజంను మేల్కొలిపిన గొప్ప సంఘ సంస్కర్త డాక్టర్ విలియం కేరీ అని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ డాక్టర్ బిషప్ కే సామ్యూల్‌బాబు కొనియాడారు. విలియం కేరీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సామ్యూల్‌బాబు మాట్లాడుతూ ఇంగ్లండ్ దేశానికి చెందిన విలియం కేరీ ఇండియాకు వచ్చి ప్రజలను చైతన్యవంతం చేశారన్నారు. సతీసహగమనం తదితర మూఢ నమ్మకాలను పారద్రోలడానికి కృషి చేశారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపురం : మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ చాంద్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం సందర్భంగా విద్యుల్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

లింగాలలో..

లింగాల : మండల పరిధిలో నేడు విద్యుత్ సరపరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రమేష్ తెలిపారు. మురారిచింతల 33-కేవీ సబ్‌స్టేషన్ మెయింటెన్స్ కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరపరా నిలిపి వేస్తున్నామన్నారు. 33-11 కేవీ హిరోజ్‌పురం, అంబకపల్లె, మురారిచింతల, వెలిదండ్ల, పార్నపల్లె, సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతందన్నారు. రైతులు సహకరించాలన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పట్టణ, రూరల్ పరిధిలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరపరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ నరసింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతు పనులు జరుగుతున్నాయని వినియోగదారులు సహకరించాలన్నారు.

కమలాపురానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలి

కడప ఎడ్యుకేషన్: కమలాపురం మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ కమలాపురానికి రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ జరగడం లేదన్నారు. సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభంకానున్నాయని ఈ నేపథ్యంలో రెగ్యులర్ ఎంఈఓను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దదర్గాలో నాగూరు దర్గా ప్రతినిధుల ప్రార్థనలు

కడప కల్చరల్ : ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప అమీన్‌పీర్(పెద్ద)దర్గాలో శుక్రవారం నాగూరు దర్గా ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాగూరు దర్గా సజ్జాదె నషీన్ మస్తాన్ సాహెబ్‌ను దర్గా ముజావర్ అమీర్ సాదరంగా ఆహ్వానించారు. సాంప్రదాయ ప్రకారం పేటా చుట్టి కండువా అలంకరించారు. నాగూరు గురువు.. దర్గాలోని ప్రధాన గురువుల మజార్ వద్ద చాదర్ సమర్పించి పూలమాలలు అలంకరించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఓస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు ఈనెల చివరినాటికి పూర్తిచేయాలని పాడా ఓస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డిలు తెలిపారు. శుక్రవారం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించి మాట్లాడారు. కడప రోడ్డులో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల ఓపీడీ బ్లాక్‌తో పాటు నర్సింగ్ కళాశాల, నగరవనం , గరండాలు, స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, శిల్పారామం పనులను పరిశీలించామన్నారు. అభివృద్ధి పనులను వేగవంతంగా ఈనెల చివరినాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలన్నారు. జూలై 8న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన చేతుల మీదుగా ప్రారంభించే వాటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు పనులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అంబకపల్లె రోడ్డు సమీపంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న కార్యాలయ భవన నిర్మాణాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహారెడ్డి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీకర్ కల్యాణ మండపంలో శుక్రవారం సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి కుమార్తె పూజిత, శ్రీతేజరెడ్డి వివాహానికి రాజకీయ ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారిలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిలు హాజరయ్యారు.

ఏపీఆర్‌జేసీలో మెరిసిన విద్యార్థులు


ఎం. విశ్రుత్


రెడ్డిసౌమ్య

పులివెందుల టౌన్ : స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో నెలరోజులపాటు ఏపీఆర్‌జేసీ ప్రవేశాలకు ఉచిత కోచింగ్ నిర్వహించారు. ఇందులో శిక్షణ పొందిన పేద విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన ఏపీఆర్‌జేసీ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధించారు.

వారిలో ఎం.విశృత్ 97మార్కులతో 217 ర్యాంకు సాధించగా రెడ్డిసౌమ్య 76 మార్కు లతో 1088వ ర్యాంకు, జ్ఞాతికగౌరి 84 మార్కులతో 1755ర్యాంకు, వనజ 68 మార్కులతో 1852 ర్యాంకు ఇలా 5వేల లోపు 9 మంది విద్యార్థినిలు ర్యాంకులు సాధించగా వీరిలో కొంతమంది మొదటి కౌన్సిలింగ్, మరికొంతమంది రెండో కౌన్సిలింగ్ ద్వారా కళాశాలల్లో సీట్లు పొందనున్నారని సేవాసమితి అధ్యక్షుడు రాజు, ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఢిల్లీలో దూసుకెళుతున్న పులివెందుల టెన్నిస్ క్రీడాకారుడు


మహేందర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : స్థానిక శ్రీసాయిచైతన్య జూనియర్ కళాశాలలో రెండవ సంవత్సరం ఇంటర్‌మీడియట్ చదువుతున్న తుమ్మల మహేందర్‌రెడ్డి ఢిల్లీలో జరుగుతున్న 66వ జాతీయ స్కూల్ గేమ్స్ టెన్నిస్ టోర్నమెంట్‌లో వరుస విజయాలతో దూసుకెళుతున్నాడు. రాజస్తాన్‌కు చెందిన సావ్యకాసిల్‌వాల్ పై 6-2, 6-2 పాయింట్లతో రాణించగా హర్యాణకు చెందిన నిషాంత్‌కుమార్‌పై 6-2, 6-1 స్కోర్‌తో గెలిచి మూడవ రౌండులో గుజరాత్‌కు చెందిన పి. ముఖేష్‌తో ఆడబోతున్నాడు. ఈ విజయాల సందర్భంగా వైఎస్సార్ సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి అభినందనలు తెలిపారు. కోచ్ విజయకుమార్ మంచి ఫలితాలు ఇస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలి

కడప ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీస్ క్రమబద్ధీకరణ చేయగా మిగిలిపోయిన కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీస్‌ను కూడా క్రమబద్ధీకరించాలని గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.

ఈ విషయమై శుక్రవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలో 3594 మంది జూనియర్ అధ్యాపకులకు గాను 1500 మందికి మేలు జరుగుతుందన్నారు. మిగిలిన వారికి రెండవ విడతలో క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మిగిలిన వారికి న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో పలువురు గవర్నమెంట్ కాంట్రాక్ట లెక్చరర్ల ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

సాగుకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలి

కడప అగ్రికల్చర్: పసుపు రైతులకు సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర ప్రకటించాలని, కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటి తుడుపుచర్యేనని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, అన్నారు. శుక్రవారం ఏపీ రైతు సంఘ నాయకులు కడప మార్కెట్‌యార్డును సందర్శించి పసుపుతోపాటు వేరుశనగ ధాన్యాలను పరిశీలించి అక్కడ రైతులతో మాట్లాడారు. దేశంలో గోధుమ తరువాత అత్యధికంగా పండించే, వినియోగించే పంట వరి అన్నారు. లక్షకు పైగా పెట్టబడి పెట్టి ఏడాదికాల పరిమితిలో పండించే పసుపు పంటకు కేవలం 400 రూపాయలు పెంచడం సరికాదన్నారు. ఒక్క పెసర పంటకు మాత్రం రూ. 803 పెంచడం తప్ప మిగిలిన పంటలకు పెంచకపోవడం దారుణం అన్నారు.

ప్రయాణ ప్రాంగణాలతో ఊరట

- వేసవిలో సౌకర్యంగా మారిన బస్టాప్‌లు
- పాడా నిధులతో సమకూరిన వసతులు



పులివెందులలో ప్రయాణీకుల సౌకర్యార్థం నిర్మించిన బస్ షెల్టర్

పులివెందుల : పట్టణం నలువైపులా అన్ని హంగులతో బస్ షెల్టర్ల నిర్మాణాలు ఏర్పాటు చేయడంతో ప్రయాణీకులకు సౌకర్యంగా మారాయి. ఈ షెల్టర్లను పాడా నిధులతో ఏర్పాటు చేశారు. పులివెందుల పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన బస్టాండ్ మినహా గతంలో బస్ షెల్టర్లు తక్కువగా వుండేవి.

పాత బస్టాండు, కడప, అనంతపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కదిరి, వీరపునాయునిపల్లె ప్రాంతాల వైపు వెళ్లేందుకు బస్సుల కోసం నిరీక్షించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ విషయాన్ని గుర్తించిన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి తక్షణం ప్రయాణీకులకు బస్‌షెల్టర్ల అవసరం ఎక్కడెక్కడ ఉందో అన్ని చోట్ల ప్రయాణ ప్రాంగణాలు (బస్టాఫ్‌లు) నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఫలితంగా పట్టణంలోని అన్ని రూట్లలోనూ బస్టాఫ్‌ల నిర్మాణాలను పూర్తి చేశారు.

ఇబ్బందులు తప్పాయి.. :



పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సుల కోసం నిరీక్షించాలంటే గతంలో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. దుకాణదారులు ఒకోకసారి షాపుకు అడ్డంగా ఉన్నామని చీదరించుకునేవారు. ప్రయాణీకుల ఇబ్బందులను గుర్తించి బస్టాఫ్‌లు నిర్మించిన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం.

– సుధాకర్ (ప్రయాణీకుడు), తొండూరు మండలం

దర్జాగా కూర్చుంటున్నాం.. :



గతంలో మేము పులివెందులకు వచ్చి ఇక్కడి నుంచి మళ్లీ లింగాల మండలానికి వెళ్లాలంటే బస్సుల కోసం నిరీక్షించేందుకు అవస్థలు పడ్డాం. దుకాణాలలో సరుకులు కొని అక్కడే కొద్దిసేపు వాళ్లను బతిమాలి ఉండేవాళ్లం. బస్సు కాస్తా ఆలస్యమైనా దుకాణ యజమానులు అక్కడి నుంచి వెళ్లాలని కసురుకునేవారు.

– గంగమ్మ(ప్రయాణీకురాలు), లింగాల మండలం